నిధులున్నా.. అందని వేతనాలు

- కంటిన్యూషన్ కాకపోవడంతోనే జాప్యం
- ఇబ్బంది పడుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు



జిల్లా బీసీ అభివృద్ధిశాఖ కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్: వారికి చెల్లించేది చాలీచాలనీ వేతనాలు. అవీ కూడా సకాలంలో అందకపోవడంతో ఆవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. అయితే జిల్లాలోని బీసీ అభివృద్ధి శాఖ పరిధిలో ఏడు ప్రీమెట్రిక్ వసతి గృహాలు ఉండగా.. ఆయా వసతి గృహాల్లో 31 మంది వాచ్‌మెన్, కుక్, కామాటీలు ఉండాలి. అయితే ఇందులో 9 మంది రెగ్యులర్ ముగ్గురేసి చొప్పున వాచ్‌మెన్, కుక్, కామాటీలు మాత్రమే ఉన్నారు. మిగితా 22 రెగ్యులర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో 15 మందిని అవుట్ సోర్సింగ్ విధానంపై ఏజన్సీల ద్వారా ఆయా బీసీ వసతి గృహాల్లో వారిని కొనసాగిస్తున్నారు. పోస్టు మెట్రిక్ వసతి గృహాలు మరో ఏడు ఉండగా అందులో 16 మంది వాచ్‌మెన్, కుక్, కామాటీలను అవుట్ సోర్సింగ్ విధానంపై కొనసాగిస్తున్నారు. అయితే ఆయా విద్యా సంవత్సరం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కంటిన్యూషన్ చేస్తారు. కానీ ఈ విద్యా సంవత్సరం ఏప్రిల్ మాసంలో కంటిన్యూషన్ చేయాల్సి ఉండగా ఆ ప్రక్రియ ఆలస్యం కావడంతో వేతనాలు సకాలంలో రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

జాప్యం జరగడంతో..

జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో అవుట్ సోర్సింగ్ విధానంపై ఉద్యోగం చేస్తున్న వాచ్‌మెన్, కుక్, కామాటీలకు ప్రభుత్వం రూ. 15,600 చొప్పున వేతనం చెల్లిస్తోంది. అయితే వీరి కోసం ప్రభుత్వం ఆయా విద్యా సంవత్సరంలో మూడు క్వాటర్లుగా నిధులు సంబంధిత శాఖకు చెల్లిస్తోంది. ఈ విద్యా సంవత్సరం 31 మేలో రూ. ప్రీ మెట్రిక్ వారికి రూ. 13,83,845, పోస్టు మెట్రిక్ వారికి రూ. 9,44,832 చెల్లించింది. రెండో క్వాటర్‌లో సెప్టెంబర్ 16న ప్రీ మెట్రిక్ వారికి రూ. 19,34,155, పోస్టుమెట్రిక్ వారికి రూ. 13,60,128 చెల్లించింది. అయితే ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కంటిన్యూషన్ చేయడంలో జాప్యం జరగడంతో వేతనాలు చెల్లించడం లేదు. దీంతో సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

ఇటీవలే కంటిన్యూషన్ అయింది



జిల్లాలోని వివిధ వసతిగృహాల్లో ఆవుట్ సోర్సింగ్ విధానంపై ఉద్యోగాలు చేస్తున్న వాచ్‌మెట్, కుక్, కామాటీల కంటిన్యూషన్‌లో జాప్యం జరగడంతో వారి వేతనాలు చెల్లింపులో జాప్యం జరిగింది. ఈ నెల 10న వారిని కంటిన్యూషన్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో వారి వేతనాలను చెల్లిస్తాం.
– రాజలింగు, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి

క్లుప్తంగా

పంట దిగుబడులు వెంటనే కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న సంగెం బొర్రన్న

ఇచ్చోడ: వర్షాకాలం సీజన్‌లో రైతులు పండించిన సోయా, మొక్కజొన్న పంటలను వెంటనే కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్‌యార్డులో అరబెట్టిన పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తూ.. తక్కువ ధరలకు విక్రయించుకుంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా మార్కెట్‌యార్డులలో పంటల కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఆయన వెంట రైతులు రవీందర్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


మందులను పరిశీలిస్తున్న అధికారులు

తలమడుగు: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ దేవిదాస్ జాదవ్ అన్నారు. శుక్రవారం దేవపూర్, బరంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతీరోజు రోగులు ఎంత మంది వస్తున్నారు, మందుల వివరాలు, సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఫార్మసిస్ట్, తదితరులు పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో పూజలు

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా ఆలయంలో శుక్రవారం ఐటీడీఏలో నూతనంగా ఏటీడబ్ల్యూవోగా బాధ్యతలు చేపట్టిన పొట్ల సదానందన్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు శాలువాతో సన్మానించారు. ఆలయ చరిత్ర, నిర్మాణం, జాతర నిర్వహణ, అభివృద్ధి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేస్లాపూర్ ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, గ్రామపెద్దలు కొట్నాక్ బారిక్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, కొట్నాక్ కోసేరావ్, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

డబ్బులు తీసుకొని ప్లాట్లు ఇవ్వని వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన బాధితుడు మహ్మద్ ఫారుఖ్ అహ్మద్ ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన యజ్‌ధాని వద్ద రెండు ప్లాట్లు కొనుగోలు చేసేందుకు రూ.4లక్ష 50 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. రిజిస్ట్రేషన్ చేయక పోగా, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా తిప్పుకుంటున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

'రాజకీయ లబ్ధి కోసమే బీసీ రిజర్వేషన్ నాటకం'

ఆదిలాబాద్‌టౌన్: రాజకీయ లబ్ధి కోసమే బీసీలను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వాడుకుంటున్నాయని, రిజర్వేషన్లపై రెండు పార్టీలకు చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రిజర్వేషన్లపై స్పష్టమైన హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి దాన్ని అమలు చేయడంలో విఫలమై బంద్‌కు మద్దతు ఇవ్వడం వెనక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో యాసం నర్సింగరావు, మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, సాజిదొద్దీన్, పందిరి భూమన్న, వేణు యాదవ్, కొండ గణేష్, ఉగ్గే విఠల్, బట్టు సతీష్ పాల్గొన్నారు.

కాపర్ తీగ చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బట్టిసావర్‌గాం వ్యవసాయ పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి అందులోని కాపర్ వైర్ చోరీకి గురైనట్లు రైతు జక్కుల రాజన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బట్టిసావర్‌గాం శివారు ప్రాంతాంలో తన వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ని గుర్తు తెలియని దొంగలు పగులగొట్టి కాపర్ తీగలు దొంగలించడం జరిగిందన్నారు. ఈ విషయంపై శుక్రవారం మావల పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

బేల: మండలంలోని మశాల(బి) గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అడనేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ సభ్యులు, విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. డోప్టాల సహకార సంఘం వైస్ చైర్మన్ బత్తుల సు దర్శన్, మాజీ సర్పంచ్ భీంరావు, అంగన్‌వాడీ టీచర్ ముక్కే సారిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయండి


నినాదాలు చేస్తున్న మాలీ సంఘం నేతలు

బోథ్: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం చేపట్టిన బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాలు, కుల సంఘాలు, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు శుక్రవారం కోరారు. వ్యాపారస్తులు, విద్యాసంస్థలు, అన్ని వర్గాల వారు బంద్‌కు మద్దతు ఇవ్వాలన్నారు.

యువజన కాంగ్రెస్ మద్దతు

కైలాస్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో శని వారం బీసీ సంఘాలు చేపట్టిన రాష్ట్రబంద్‌కు యువజన కాంగ్రెస్ సంపూర్ణ మద్దతునిస్తుందని ఆ విభాగం ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామరూపేష్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

ఆదిలాబాద్‌రూరల్: రాజకీయాలకతీతంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మాలీ కులస్తులందరూ శనివారం నిర్వహించే బంద్‌లో పాల్గొనాలని, బీసీల బంద్‌కు తమ సంఘం తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పూలే విశ్రాంతి భవనంలో మాట్లాడారు. పార్లమెంట్‌లో తీర్మానం చేసి రాష్ట్రపతి ఆమోదం ద్వారా మాలీ, మధుర, వాల్మీకి బోయలకు ఎస్టీ హోదా కల్పన కోసం కులసంఘాలు, రాజకీయ పార్టీలు కృషి చేయాలన్నారు.

కైలాస్‌నగర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం బీసీ జేఏసీ శనివారం తలపెట్టిన బంద్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాలు శనివారం ఇచ్చిన బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు రజక సంఘం పట్టణశాఖ అడహక్ కమిటీ అధ్యక్షుడు జక్కుల కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. రజకులు స్వచ్ఛందంగా పాల్గొని సహకరించాలని కోరారు.

తాంసి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం బీసీ సంఘాల ఆధ్వర్యంలో నేడు చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో బీసీ సంఘాల నాయకులతో కలిసి ప్రకటన విడుదల చేశారు.

'దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇచ్చోడ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి చేసిన న్యాయవాది రాకేశ్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిట్టి రవి డిమాండ్ చేశారు. శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జాదవ్ రమేశ్‌కు అందచేశారు. దాడి చేసిన న్యాయవాది వెనుక ఉన్న దుష్ట శక్తులను సైతం గుర్తించి అరెస్ట్ చేయాలన్నారు. సీనియర్ జడ్జిలతో విచారణ చేయించాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సిరిసిల్ల భూ మయ్య, మచ్చ పోశెట్టి, ఆరెపల్లి రవి, ముదుగు శ్రీనివాస్, అన్నెల లక్ష్మణ్, చిట్టి ప్రశాంత్, కల్లెపెల్లి నందు, నారాయణ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు ఉపులేటి శీను, అందేరే బాలాజీ, కాంబ్లే ప్రహ్లాద్, నగేశ్, రాజేష్, కేంద్రే అంకుష్ పాల్గొన్నారు.

నేరడిగొండ: సుప్రీంకోర్టు జడ్జి బీఆర్ గవాయిపై దాడి అప్రజాస్వామికమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు గజ్జల శంకర్, సారంగా రవి, సంతోష్, జూల అడెల్లు, జుల సంతోష్, గంగాధర్, తోట అడెల్లు, గంగాధర్, భోజన్న, రాము, అశోక్, మోహన్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడిని వ్యక్తిని శిక్షించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు రాంప్రసాద్, కొమ్లే పరశురాం, మోరే రంజు, సోమ్నాథ్, నగేశ్ పాల్గొన్నారు.

దండారీ ఉత్సవాలు


నృత్యం చేస్తున్న గుస్సాడీలు

తలమడుగు: మండలంలోని పునగూడలో దండారీ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దండారీ ఉత్సవాలకు బోథ్ మండలంలోని పాట్నాపూర్ గ్రామం నుంచి వచ్చిన దండారీలు చేసిన నృత్యం ఆకట్టుకుంది. అనంతరం గుస్సాడీలతో వచ్చిన వారితో గ్రామస్తులు కలిసి సామూహిక భోజనం చేశారు. కుమ్ర గంగాధర్, కుమ్ర జ్ఞానేశ్వర్, లక్ష్మణ్, మహాజన్, భీంరావు, ఛత్రపతి పాల్గొన్నారు.

గురుకులం తనిఖీ

బేల: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి మనోహర్ తనిఖీ చేశారు. వంట గది, పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ప్రిన్సిపాల్ రంగన్నను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు ల్యాబ్ ఉపయోగకరం

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులకు పాఠ్యాంశాన్ని అవగాహన కల్పించడంలో ఏఆర్‌వీఆర్ ల్యాబ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కోర్సు డైరెక్టర్, జిల్లా సైన్స్ అధికారి ఆరె భాస్కర్ అన్నారు. జిల్లాలో ఏఆర్‌వీఆర్ ల్యాబ్ మంజూరైన పాఠశాలల ఉపాధ్యాయులకు శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జెడ్పీఎస్ఎస్ యాపల్‌గూడ పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. మండల విద్యాధికారి రమేశ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, సెక్టోరియల్ అధికారి రఘు రమణ, పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఈఎంటీ సతీష్

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం మెడికల్ ఆఫీసర్ భీంరావ్ ఆధ్వర్యంలో 108 సిబ్బందితో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసస్కిటేషన్)పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 108 ఈఎంటీ సతీష్, ఎంఈవో రాంకిషన్, ప్రధానోపాధ్యాయులు భూమన్న, ఉపాధ్యాయులు రమేశ్, భగత్ బాపురావ్, శ్రీనివాస్, 108 సిబ్బంది పాల్గొన్నారు.

భీంపూర్: సీపీఆర్‌పై తప్పనిసరిగా అవగాహన ఉండాలని మండల వైద్యాధికారి నిఖిల్‌రాజ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ రెసిడెన్షియల్ కళాశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌వో రజిని, మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు మేఘ, రోహిదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు 108 సిబ్బంది శుక్రవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సీపీఆర్ ద్వారా ప్రాణాలు ఎలా కాపాడుకోవచ్చో వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి హుస్సేన్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ రమేశ్, సంతోష్, శైలేష్,, గంగయ్య పాల్గొన్నారు.

'గ్రీన్ ఇండియా'లో భాగస్వాములు కావాలి


మొక్కకు నీరు పోస్తున్న సంతోష్ కుమార్

ఆదిలాబాద్‌రూరల్: గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగస్వామ్యం కావాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, గ్రీన్ ఇండియా అధ్యక్షుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని ఖండాల రోడ్డు మార్గంలో గల మొలాల గుట్ట శివారులో పైలెట్ ప్రాజెక్టుగా వెదురు మొక్కల సాగు పంట క్షేత్రాన్ని ప్రారంభించారు. కేసీఆర్ స్ఫూర్తితో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణతో పాటు మొక్కల పెంపకాన్ని విస్తృత స్థాయిలో పెంచడం జరుగుతుందన్నారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మాట్లాడుతూ.. ఆదివాసీ కళాలను ప్రోత్సహిస్తూ మొదటిసారి వెదురు సాగు విస్తీర్ణాన్ని చేపట్టి ఆదివాసీ కళాకారులకు ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ జనార్దన్, గండ్రత్ రమేశ్, ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దీన్, కనక రమణ, పెందూర్ దేవన్న, కుమ్ర రాజు, గేడం రాము, లక్ష్మణ్, కొండ గణేష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ సంతోష్‌కుమార్‌ను కలిసిన మాజీ సర్పంచ్

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను ముఖరా (కె) మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సూభాష్‌లు శుక్రవారం మార్యద పూర్వకంగా కలిశారు. కేసీఆర్ హరితస్ఫూర్తితో గ్రీన్ ఇండియా చాలెంజ్ భాగంగా ముఖరా(కె)లో లక్ష మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు తెలిపారు.

సంస్కృతిని భావితరాలకు అందించాలి


దండారీ ఉత్సవాల్లో పాల్గొన్న గజేందర్

నేరడిగొండ: సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రెంగన్వాడీ గ్రామంలో నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆదివాసీలతో కలిసి గుస్సాడీ నృత్యం చేశారు. గిరిజన గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆదివాసీల సంస్కృతి గొప్పది

భీంపూర్: ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని ఎస్సై భూపాలపల్లి విక్రమ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మర్కగూడ, బెల్సారి రాంపూర్ గ్రామాల్లో నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. గ్రామానికి వచ్చి ఆయనకు ఆదివాసీలు గుస్సాడీ నృత్యంతో స్వాగతం పలికారు.

నివాస ప్రాంతాల్లో మద్యం షాపులు ఏర్పాటు చేయవద్దు


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బోథ్: నివాస ప్రాంతాలకు దూరంగా మద్యం షాపులు ఏర్పాటు చేయాలని బోథ్ పట్టణవాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇచ్చోడలోని ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని నివాస గృహాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, బాలికల హాస్టల్ ప్రాంతాలకు సమీపంలో ఉన్న రెండు మద్యం షాపులతో ఇబ్బంది పడుతున్నామన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే మద్యం షాపులను నిబంధనల ప్రకారం నివాస ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేయాలన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

తలమడుగు: పశువులకు తప్పవనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధికారి రామారావు రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బరంపూర్ గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ముందస్తుగా వ్యాధులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. పశువైద్యాధికారి లావణ్య, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నా రు.

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె)లో శుక్రవారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు., కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సంధ్య, రమేశ్, శేఖర్, ఉదయ్, గంగయ్య పాల్గొన్నారు.

కొమ్మకొమ్మకో కొంగ


చెట్లకు తెల్లటి పూవ్వులు పూసింది అనుకుంటే పొరబడినట్లే. సిరికొండ శివారులోని చెరువు వద్ద శుక్రవారం సాయంత్రం చెట్లపై కొంగలు వాలి సేద తిరుతున్నాయి. అటూ వైపు వచ్చిన వారిని ఆకట్టుకుంటున్నాయి.
– సిరికొండ

ఉచిత కంటి పరీక్షలు

బోథ్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బోథ్ మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి పరీక్షల ఆసుపత్రి సహకారంతో 44 మందికి పరీక్షలు చేసి కళ్లద్దాలు అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి, ఆప్తాల్మిక్ అధికారి భాస్కర్ రావు, టెక్నీషియన్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నంబర్‌ను సరి చేసుకోవాలి

బోథ్: పత్తి అమ్మకం కోసం స్లాట్ బుక్ చేసుకునే ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు, తమ మొబైల్ నంబర్ తప్పుగా నమోదై ఉంటే వెంటనే సరిచేసుకోవాలని బోథ్ మండల వ్యవసాయాధికారి రవితేజ తెలిపారు. శుక్రవారం కౌఠ(బి) గ్రామంలో రైతులకు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకునేందుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆరోగ్య పాఠశాలపై కళాజాత

భీంపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా డీపీఆర్‌వో ఆదేశానుసారం శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక కళాబృందం సభ్యులు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, మానసిక వ్యక్తిత్వ వికాసం, విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కళాకారులు వెంకట్రావు, రమేశ్, రవి, రాజలింగు, మురళి, రాజు, శ్రీలత, నర్సమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

స్వామివారిని దర్శించుకున్న భక్తులు

జైనథ్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన భక్తులు కాలినడకన వచ్చి శ్రీలక్ష్మీ నారాయణ స్వామిని దర్శించుకుంటారు. శుక్రవారం ఉదయం గ్రామస్తులందరూ కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

పరికరాలు అందజేత

బోథ్: మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో వైద్యానికి సంబంధించిన పలు పరికరాలను బోథ్ మండల కేంద్రానికి చెందిన వీజీఎస్ సభ్యులు శుక్రవారం అందజేశారు. సమాజానికి తమ వంతు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో పరికరాలు అందజేసినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో పనిచేసేందుకు ఆసక్తి గల వారు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి బిక్కు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిలో వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏడో తరగతి పాసై ఉండి, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌ఫొటోలతో పాటు బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు జత చేసి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ పోస్టుకు మహిళ అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నేరడిగొండ: మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రాథోడ్ రమేశ్ ఆయన అనుచరులతో కలిసి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చదువుకు దూరం కావద్దు

భీంపూర్: బడీడు పిల్లలు చదువుకు దూరం కాకూడదని సీఆర్‌పీ రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుంజాల గ్రామంలో పర్యటించారు. ఇంట్లోనే ఉన్న బడీడు పిల్లలను గుర్తించి, పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

అడిషనల్ కలెక్టర్‌కు సన్మానం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి ఎస్.రాజేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. సంఘం అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి జాఫర్, రాజేశ్వర్ ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


విద్యార్థులను చదివిస్తున్న ఎంఈవో వెంకట్‌రావు

తలమడుగు: పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈవో వెంకట్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని కజ్జర్ల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు ఎంత మంది ఉన్నారు? మెను ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు, వంటగదిని శుభ్రంగా ఉంచాలన్నా రు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు.